సాక్షి పెద్దపల్లి

బుధవారం । 12 । జూలై । 2023



రెస్క్యూ ఘనంగా..
జాతీయ స్థాయి రెస్క్యూ పోటీలు మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య సూచించారు. 8లో▸



వేతన ఒప్పందం ఇంకెంతకాలం?
భారతావనికి వెలుగులు పంచుతున్న ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపడం లేదన్న ఆరోపణలున్నాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/25.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ముప్పిరితోటలో డీఎల్‌పీవో విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో పంచాయతీ నిధులను సర్పంచ్, కార్యదర్శి దుర్వినియోగం చేస్తున్నారని మాజీ ఉపసర్పంచ్ కందుల కొమురయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. డీఎల్‌పీవో వేణుగోపాల్ మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. రోడ్లకు మొరం పోసినట్లు బిల్లులు డ్రా చేశారని, పలు వీధుల్లో మొరమే పోయలేదని, సమాచార హక్కు చట్టం కింద సమాచారం సేకరించి కలెక్టర్‌కు కొమురయ్య ఫిర్యాదు చేశాడు. పంచాయతీ రికార్డులు, రిజిస్టర్లు, పనుల ఎంబీ రికార్డులు, చేపట్టిన పనులను డీఎల్‌పీవో పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎంపీవో అనిల్‌రెడ్డి, సర్పంచ్ ఐలయ్య, పంచాయతీ సెక్రెటరీ హైమద్‌మోయినోద్దీన్, ఫిర్యాదుదారు ఉన్నారు.

ఎల్లంపల్లికి కొనసాగుతున్న ఎత్తిపోతలు



మూడు మోటార్లతో పంపింగ్

రామగుండం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి పార్వతీ పంపుహౌజ్ నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మంగళవారం మూడు మోటార్ల సహాయంతో 15,660 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తున్నట్లు అధికారులు తెలిపారు.

13న ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల భిక్షాటన



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, వేతన ఒప్పందం అమలు చేయకుండా యాజమాన్యం జాప్యం చేయడం సరికాదని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు తెలిపారు. ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. యాజమాన్యం మొండి వైఖరి వీడాలన్నారు. చట్ట ప్రకారం చేసుకున్న ఒప్పందాన్ని ఐదేళ్లు గడిచినా అమలు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని తెలిపారు. ఆర్‌ఎల్‌సీ సమక్షంలో బుధవారం జరిగే చర్చల్లో సమస్య కొలిక్కి రాకుంటే ఈనెల 13 నుంచి ప్రాజెక్టు గేటు ముందు భిక్షాటన చేస్తామని హెచ్చరించారు. చిలుక శంకర్, నాంసాని శంకర్, రాధారపు రాజమల్లయ్య, ఇజ్జగిరి భూమయ్య, భూమల్ల చందర్, సత్యం, శ్రీనివాస్, లక్ష్మణ్, ఏ.శ్రీనివాస్, టి.శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో పఠనాసక్తి



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ మాధవి

గోదావరిఖనిటౌన్: విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించడానికి పాఠశాల గ్రంథాలయం తోడ్పడుతుందని, ప్రతి పాఠశాలలో గ్రంథాలయాలను వినియోగించుకోవాలని డీఈవో మాధవి సూచించారు. విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలను పెంపొందించుటకు రూమ్‌టూరీడ్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఎంలకు స్థానిక గాంధీ పార్క్ ప్రభుత్వ పాఠశాలలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతి పాఠశాలలో విధిగా విద్యార్థులతో గ్రంథాలయ పుస్తకాలు పఠనం చేయడానికి ప్రత్యేక పీరియడ్ కేటాయించాలని అన్నారు. జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి షేక్, మండల విద్యాధికారి పి.సంపత్‌రావు, రూం టూ రీడ్ ప్రోగ్రాం ఆఫీసర్ రాంబాబు, ప్రతినిధులు ప్రవీణ్, సింధు, 31 పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సిటిజన్ ఫీడ్‌బ్యాక్

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బల్దియాల తీరు
- పోటీలో పౌరుల స్పందనకు ప్రాధాన్యం
- 9 ప్రశ్నలతో ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ



అభిప్రాయాలు సేకరిస్తున్న సిబ్బంది

సిటిజన్ ఫీడ్ బ్యాక్ వివరాలు

బల్దియా	ప్రజాభిప్రాయం
రామగుండం	1,346
పెద్దపల్లి	2,461
సుల్తానాబాద్	86
మంథని	10

కోల్‌సిటీ(రామగుండం): స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో జిల్లాలోని రామగుండం నగరపాలక సంస్థతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు ఆశించినస్థాయిలో పనితీరును పెంచుకోవడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023 పోటీలో ప్రజాభిప్రాయ సేకరణకు ప్రత్యేకంగా మార్కులు ఉండడంతో దేశవ్యాప్తంగా మున్సిపాలిటీలు సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌పై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందులో అన్ని మున్సిపాలిటీల్లోని పౌరుల అభిప్రాయ సేకరణలో ముందంజలో ఉండగా.. జిల్లాలోని మున్సిపాలిటీలు వెనుకబడ్డాయి.

పౌరుల స్పందనకు 30 శాతం మార్కులు

దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో పారిశుధ్యాన్ని మెరుపర్చాలనే లక్ష్యంతో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీలో సిటిజన్ ఫీడ్ బ్యాక్ ప్రాధాన్యత కలిగి ఉంది. ప్రజాభిప్రాయ సేకరణకు 30 శాతం మార్కులు ఉండడంతో అన్ని బల్దియాలు దీనిపై దృష్టిసారించాయి. ఎక్కువ సంఖ్యలో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సేకరించే పనిలో నిమగ్నమయ్యాయి.

ఆన్‌లైన్‌లో తొమ్మిది ప్రశ్నలు

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో కార్పొరేషన్, మున్సిపాలిటీలు మెరుగైన ర్యాంక్ సాధించడానికి పౌరుల స్పందన కూడా కీలకం. ఇందుకోసం తొమ్మిది ప్రశ్నలను కేటాయించారు. ఇంటి నుంచి రోజు చెత్త సేకరిస్తున్నారా..? ఇంట్లోనే తడి, పొడి చెత్తను విడిగా వేరుచేస్తున్నారా..? కాలువ, నాలాలు శుభ్రంగా ఉన్నాయా..? ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ గురించి తెలుసా..? కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్‌ను ఉపయోగించారా..? వీటి నిర్వహణ ఎలా ఉన్నాయి..? డిజిటల్ మ్యాప్‌లో వీటిని కనుక్కోవచ్చని మీకు తెలుసా..? పరిసరాల పరిశుభ్రతకు ఎలా రేట్ ఇస్తారు..? నగరం మొత్తం పరిశుభ్రతకు ఎలా రేట్ వేస్తారు..? అనే తొమ్మిది ప్రశ్నలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. వెబ్‌సైట్ https//sbmurban.org/feedback లో మొబైల్ నంబర్ నమోదు చేసి, ఓటీపీతో లాగిన్ అయ్యాక, వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అందులో వచ్చిన తొమ్మిది ప్రశ్నలకు అవును, కాదు సమాధానాలను సమర్పించాలి.

స్పందన లేని ఫీడ్‌బ్యాక్

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అధికారులు ప్రజాభిప్రాయ సేకరించే విషయంలో పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో మొక్కుబడిగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారని తెలుస్తోంది. మంగళవారం రాత్రి ఏడు గంటల వరకు రామగుండం నగరపాలక సంస్థలో 1,346 మంది, పెద్దపల్లి మున్సిపాలిటీలో 2,461 మంది, సుల్తానాబాద్‌లో 86 మంది, మంథనిలో 10 మంది మాత్రమే తమ అభిప్రాయాలను నమోదు చేశారు. అభిప్రాయ సేకరణలో పెద్దపల్లి ముందంజలో ఉండగా.. మంథని మాత్రం బాగా వెనకబడింది.

సుందరం.. బహుదూరం..!



పెద్దపల్లిలోని జెండా చౌరస్తా

- జిల్లాకేంద్రంగా మారినా షురూ కాని పనులు
- అధ్వానంగా పట్టణ ప్రధాన కూడళ్లు
- అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు



జిల్లాకేంద్రంలో అభివృద్ధికి నోచుకోని కూడలి

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు కేంద్రంగా ఉన్న పెద్దపల్లి ఆరేళ్ల క్రితం జిల్లా కేంద్రంగా అవతరించింది. అయినప్పటికీ జిల్లాకేంద్రానికి తగిన హంగులు మాత్రం ఇక్కడ మచ్చుకైనా కనిపించడం లేదు. పట్టణంలో ప్రధాన కూడలి అయిన జెండా చౌరస్తాతోపాటు తిలక్‌నగర్, అమర్‌నగర్, కమాన్, చీకురాయి రోడ్, ప్రగతినగర్, బస్టాండ్ ప్రాంతాల్లో కూడళ్లు ఉన్నాయి.

సుభాష్ విగ్రహం వద్ద ఏర్పాటుతోనే సరి

జిల్లా తొలి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అలగు వర్షిణి జిల్లాకేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించి ఆరు ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. ఇక్కడి నుంచి ముంబయికి వెళ్లి వచ్చిన అధికారుల బృందం ఆలోచనల మేరకు సుభాష్‌విగ్రహం వద్ద ఓ ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. ఇంతలో ఆమె బదిలీ కావడంతో మిగతా సర్కిళ్ల పనులు ముందుకు సాగడం లేదు.

జెండాకూడలితో పాటు

జిల్లాకేంద్రం నడిబొడ్డున ఉన్న జెండాచౌరస్తా, తిలక్‌నగర్‌లోని చాకలిఐలమ్మ, అమర్‌నగర్ (పాతకోర్టు)లోని చౌరస్తా, అయ్యప్పగుడి, బస్టాండ్, కమాన్, చీకురాయి చౌరస్తాల వద్ద సర్కిళ్లను అభివృద్ధి చేసి పట్టణానికి కొత్తశోభను తేవాలని పలువురు కోరుతున్నారు.

ప్రధానరోడ్ల అభివృద్ధితో..

రాజీవ్ రహదారిపై డివైడర్లు, వాటిమధ్య పచ్చని చెట్లను పెంచడంతోపాటు పట్టణంలోని సాగర్ రోడ్, ధర్మారంరోడ్, బందారికుంట, కెనాల్ రోడ్లను ఆధునీకరిస్తే ఆయా ప్రాంతాలకు కొత్త శోభ సంతరించుకుంది. అమర్‌నగర్ నుంచి సుభాష్‌నగర్ రోడ్డు వరకు పనులు పురోగతిలో ఉన్నాయి. సుభాష్‌నగర్‌లో పనులు మొదలుకావాల్సి ఉంది. బీటీరోడ్డు పనులు చేసే ప్రాంతాల్లో రోడ్లను విస్తరిస్తారా..? ఉన్నంతలోనే వేస్తారా..? అనే మీమాంస ఆయా ప్రాంతవాసుల్లో నెలకొంది.

> **రూ.50లక్షలతో రెండు సర్కిళ్ల అభివృద్ధి**
>
> పట్టణంలోని ప్రధాన కూడళ్లను ఆధునీకరించి సర్వాంగ తీర్చిదిద్దే పనులు దశలవారీగా చేపడుతున్నాం. కొద్దిరోజుల్లోనే తిలక్‌నగర్, చాకలిఐలమ్మ, పాతకోర్టు వద్దగల సర్కిళ్లను ఆధునీకరించే పనులను రూ.50లక్షలతో చేపట్టనున్నాం.
>
> – శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్

ప్రత్యేక పంచాయతీలుగా తండాలు అభివృద్ధి



శీత్లా భవాని వేడుకలో పాల్గొన్న మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు

ధర్మారం: రాష్ట్ర ప్రభుత్వం గిరిజన గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో తండాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని కొత్తూరు, బంజేరుపల్లితండా (బి), కొత్తపల్లి, కమ్మరిఖాన్‌పేట తండా (కే)లో మంగళవారం పర్యటించారు. గిరిజనుల ఆరాధ్యదైవం శీత్లాభవానీ వేడుకలలో ఆయన సతీమణి, కొప్పుల చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ కొప్పుల స్నేహలతతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రభుత్వం అన్ని పండుగలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి గిరిజనుడికీ ప్రభుత్వ ఫలాలు అందించామని వివరించారు. గిరిజనులకు రిజర్వేషన్ పెంచామని, విద్యాలయాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు తాళ్ల మల్లేశం, భూక్య చంద్రానాయక్, కోమటిరెడ్డి లలిత, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచు భూక్య రాజునాయక్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పుస్కూరి రామారావు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి..

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకని, ఆయనకు రైతులే తగిన బుద్ధి చెప్పాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కొత్తపల్లి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తుంటే రేవంత్‌మాత్రం ఉచిత కరెంట్ దండగ అని, మూడు గంటలు ఇస్తే సరిపోతుందని ప్రకటించడం సిగ్గు చేటని పేర్కొన్నారు. రైతులు బాగుపడుతుంటే చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ సునిత



సమావేశమైన మండల మహిళాసమాఖ్య సభ్యులు

పెద్దపల్లిరూరల్: మహిళాసంఘాలు పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభ్యున్నతి సాధించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అదనపు అధికారి సునిత అన్నారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మాట్లాడారు. బ్యాంక్‌ల ద్వారా రుణాలను సంఘాల అర్హతను బట్టి కేటాయిస్తారని, రుణాలు తీసుకున్నవారు ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. పరిశ్రమలు, వ్యాపారాలు చేసి ముందుకు సాగాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న కారణంగా వానాకాలంలో పాటించాల్సిన జాగ్రత్తలపై సభ్యులు అవగాహన పెంచుకోవాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీవాణి, ఏపీఎం సంపత్, సీసీలు అనాసి శ్రీనివాస్, హరి పాల్గొన్నారు.

సింగరేణిలో డెప్యుటేషన్ల దందా

- కార్మికులకు పర్మినెంట్ ఎప్పుడో..?
- సంస్థ వ్యాప్తంగా 1904 మంది
- విజిలెన్స్ దృష్టి సారించాలని డిమాండ్

ఏరియా	డెప్యూటేషన్ కార్మికులు
ఆర్జీ–1	331
ఆర్జీ–2	112
ఆర్జీ–3	170
భూపాల్‌పల్లి	98
శ్రీరాంపూర్	257
మందమర్రి	144
బెల్లంపల్లి	34
కొత్తగూడెం	354
కార్పొరేట్	51
మణుగూరు	317
ఇల్లెందు	36
మొత్తం	1904

గోదావరిఖని: సింగరేణిలో డెప్యుటేషన్ల దందా జోరుగా సాగుతోంది. పర్మినెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నా.. కాసులకు కక్కుర్తి పడి డెప్యుటేషన్‌పై అధికారులు మక్కువ చూపుతున్నారని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థవ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లో 1904మంది కార్మికులు డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో డెప్యుటేషన్‌పై పంపి మూడు నెలల్లోపు సొంత ప్రాంతానికి బదిలీ చేయాల్సి ఉంటుందని, ఎక్కువ రోజులు పనిచేయించడానికి వీలులేదని కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేస్తున్నారు. అయితే డబ్బులు చేతులు మారుతుండటంతో ఏళ్ల తరబడి ఒకేచోట ఉండేలా దందా సాగుతోందని అంటున్నారు. సంస్థవ్యాప్తంగా యువ కార్మికులు ఎక్కువగా ఉండడం.. రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, గుర్తింపు యూనియన్ నాయకుల సిఫారసులతో డెప్యుటేషన్ బదిలీలు పెరిగిపోయాయి. చాలామంది ఉద్యోగులు ఏళ్ల తరబడి డిప్యుటేషన్‌పై పనిచేసే పరిస్థితి నెలకొంది. వాస్తవానికి అత్యవసర పరిస్థితుల్లో డెప్యుటేషన్‌పై ఉద్యోగులను బదిలీ చేసే వీలుంటుంది. ఇటీవల కాలంలో సిఫారసులు తాకిడి పెరగడంతో చాలామంది యువ కార్మికులు లైట్ జాబ్‌కోసం పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యే, మంత్రులు, యూనియన్ నాయకులు చుట్టూ ప్రదక్షణచేస్తూ యువ కార్మికులు అనుకున్న చోట పోస్టింగ్ వేయించుకుంటున్నారు. దీంతో ఏళ్ల తరబడి అండర్ గ్రౌండ్ గనుల్లో పనిచేస్తున్న కార్మికులు అక్కడే ఉంటుండగా.. కొత్తగా వచ్చిన యువ కార్మికులకు మాత్రం డెప్యుటేషన్ కోసం ఒత్తిడి పెంచుతున్నారు.

> **చేతులు మారుతున్న సొమ్ము**
>
> చాలామంది యువ కార్మికులు ఉన్నత చదువులు చదివి తండ్రి స్థానంలో సింగరేణి ఉద్యోగంలో చేరారు. ఈ క్రమంలో భూగర్భగనుల్లోకి దిగి పనిచేయడానికి అంగీకరించడంలేదు. డ్యూటీలో జాయిన్ అయిన మరుసటి రోజు నుంచి సిఫారసు లేఖల కోసం ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. ఇందుకు పెద్ద మొత్తంలో డబ్బులు కూడా ముట్టజెప్పి తమ పనిని కానిస్తున్నారు.


అసలు డెప్యుటేషన్ ఎందుకు..?

భూగర్భగనుల్లో పనిచేస్తూ.. అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఖాళీ పోస్టుల్లో డెప్యుటేషన్‌పై పంపే ఆనవాయితీ సంస్థలో కొనసాగింది. అంతేకాకుండా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కార్మికులకు కూడా ఈ డెప్యుటేషన్ ద్వారా భూగర్భగని నుండి పైకి పంపే వెసులుబాటు కల్పించారు. ఇటీవల యువ కార్మికుల సంఖ్య పెరగడంతో డెప్యుటేషన్ల దందా విపరీతంగా పెరిగిపోయిందని కార్మికులు వాపోతున్నారు. ఈవిషయంపై విజిలెన్స్ విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకరావాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



సింగరేణి యువ కార్మికులు

పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత



సమీక్షిస్తున్న కలెక్టర్

మంథని: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ సంగీత సూచించారు. మండలంలోని నాగారంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పర్యటించారు. పారిశుధ్యం నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఉండాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రించాలని, ప్లాస్టిక్‌ను సేకరించి ఏజెన్సీకి అప్పగించాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్‌ను సందర్శించి ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. డీఆర్‌డీఏ శ్రీధర్, స్వచ్ఛభారత్ మిషన్ మేనేజర్ రాఘవులు, ఎంపీడీఓ రమేశ్, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చందర్



గోదావరిఖని: రామగుండం మెడికల్ కళాశాలకు సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)గా పేరు పెట్టడాన్ని హర్షిస్తూ.. రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను మంగళవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కలిశారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలకు వైద్య కళాశాలలో ఐదుశాతం రిజర్వేషన్ కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రామగుండం కార్పొరేషన్‌కు రూ.వంద కోట్లు త్వరగా విడుదల చేయాలని మంత్రిని కోరారు.



వేతన ఒప్పందం ఇంకెంతకాలం?

- కొత్త వేతనం కోసం ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల ఎదురుచూపు
- కార్మిక సంఘాల జేఏసీ ఆందోళన బాట
- నేడు ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చర్చలు


వేతన ఒప్పంద చర్చలు సఫలమైనట్లు ప్రకటించిన ఎంపీ, ఎమ్మెల్యే, ఈడీ, కార్మిక నాయకులు (ఫైల్)

జ్యోతినగర్: భారతావనికి వెలుగులు పంచుతున్న ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపడం లేదన్న ఆరోపణలున్నాయి. కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వేతన ఒప్పందం అమలు కోసం ఎదురుచూస్తున్న కార్మికులకు నిరాశే మిగులుతోంది. గత వేతన ఒప్పందం కాలపరిమితి 2022 ఆగస్టు 10తో ముగిసింది. అందులోని కొన్ని కీలక డిమాండ్లను యాజమాన్యం నెరవేర్చకపోవడంతో కార్మిక నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో గతేడాది సెప్టెంబర్ 1న పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే చందర్, ఇటీవల బదిలీపై వెళ్లిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు వేతన ఒప్పందంపై చర్చలు సఫలమైనట్లు ప్రకటించారు. కానీ పది నెలలు గడుస్తున్నా అమలు కాకపోవడంతో కార్మికులు నిరాశకు గురయ్యారు. పాత వేతన ఒప్పందం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం.. కొత్త వేతన ఒప్పందం చర్చల ప్రక్రియ పక్కనపెట్టడంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా తమ వేతనాలు ఉండాలని కోరుతున్నారు.

కాంట్రాక్టు కార్మికుల ప్రధాన డిమాండ్లు..

- సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.
- ప్రస్తుతం పొందుతున్న అలవెన్సులపై రూ.10,500 అదనంగా చెల్లించాలి.
- కనీస బోనస్‌పై 30 శాతం పెంచాలి.
- ఖాళీగా ఉన్న క్వార్టర్లలో అవకాశం కల్పించాలి.
- నైట్ అలవెన్సు రూ.500 చెల్లించాలి. డస్ట్ అలవెన్సు కింద ప్రతినెలా రూ.1,000 ఇవ్వాలి.
- స్టాటుటరీ, నాన్ స్టాటుటరీ అలవెన్సులు పూర్తిగా చెల్లించాలి.
- రెయిన్ కోట్, వార్మ్ కోట్, రెండు జతల దుస్తులు, షూలు ఇవ్వాలి.
- ప్రమాదంలో కార్మికుడు మరణించినా, ఆన్ డ్యూటీలో సాధారణ మరణం పొందినా బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు ఇవ్వాలి.
- ఉద్యోగ విరమణ పొంది, మరణించిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం లేదా రూ.10 లక్షలు చెల్లించాలి.
- డిపెండెంట్ కింద పనిలో చేరిన కార్మికులందరికీ పూర్తిస్థాయి అలవెన్సు, పర్మినెంట్ గేట్ పాసులు ఇవ్వాలి.
- డెత్ రిలీఫ్ స్కీంను కొనసాగించాలి.

చర్చలు సఫలం కాకపోతే 13 నుంచి ఉద్యమం

కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించేందుకు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తొలుత ఈ నెల 10ని చివరి తేదీగా ప్రకటించారు. 11 నుంచి కార్మికుల సహకారంతో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని భావించారు. 12న హైదరాబాద్‌లోని ఆర్‌ఎల్‌సీ సమక్షంలో యాజమాన్యం ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు చర్చల్లో పాల్గొననున్నారు. సఫలం కాకుంటే 13 నుంచి భిక్షాటనతో ఉద్యమం చేయనున్నారు.

యాజమాన్యంతో చర్చించాలి


కొత్త వేతన ఒప్పందం అమలుకు కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యంతో పూర్తిస్థాయిలో చర్చించాలి. యాజమాన్యం చర్చల పేరుతో కాలయాపన చేస్తోంది. ఇది బాధాకరం.
– చంద్రమౌళి, కాంట్రాక్టు కార్మికుడు

ఎందుకు అమలు చేయడం లేదు?


వేతన ఒప్పందంపై చర్చలు సఫలమని ఎంపీ, ఎమ్మెల్యే తెలిపారు. కానీ ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలి. పాత ఒప్పందం పూర్తికాకపోతే కొత్త వేతన ఒప్పందం ఎప్పుడు అమలవుతుంది?
–అజీమొద్దీన్, కాంట్రాక్టు కార్మికుడు

బీ-గ్రేడ్ వేతనాలు పెంచాలి


ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులోని కార్మికులకు బీ–గ్రేడ్ వేతనాలు చెల్లించాలి. కార్మిక సంఘాల ఉద్యమానికి అందరం అండగా ఉంటాం. ఉద్యమాలు చేస్తాం. వేతనాలు పెంచేందుకు కృషి చేయాలి.
– తోట రవీందర్, కాంట్రాక్టు కార్మికుడు

క్లుప్తంగా

మొన్న బీఆర్‌ఎస్‌లోకి.. నేడు మళ్లీ కాంగ్రెస్ గూటికి


అశోక్‌కు కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని సబ్బితం గ్రామానికి చెందిన కందుల అశోక్ మంగళవారం తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాజీ ఎమ్మెల్యే విజయరమణారావుకు సన్నిహితుడు. ఈ నెల 7న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అశోక్ బీఆర్ఎస్ కండువా కప్పి, పార్టీలో చేర్చుకున్నారు. కానీ నాలుగు రోజులకే తిరిగి హస్తం గూటికి చేరడం చర్చనీయాంశంగా మారింది.

రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


డైరెక్టర్(పా) బలరాంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బూర్ల లక్ష్మీనారాయణ, మండ రమాకాంత్ కోరారు. ఈ మేరకు డైరెక్టర్(పా) బలరాంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న విశ్రాంత కార్మికులు దీర్ఘకాలిక జబ్బులకు మందులు తీసుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి రావడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆర్థికంగానూ నష్టపోతున్నందున వారి సౌకర్యార్థం కార్పొరేట్ హాస్పిటల్‌లో సంస్థ లిస్టులో ఉన్న కేంద్రాల్లో మందులు సరఫరా చేయాలన్నారు. కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికేర్ స్కీం (సీపీఆర్‌ఎంఎస్) కార్డు ద్వారా హైదరాబాద్ ఇతర ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ హాస్పిటల్స్ వైద్యం అందించేందుకు వాటికి ఇదివరకు ఉన్న బకాయిలు చెల్లించాలని విన్నవించారు.

నేటి పాఠశాలల బంద్ విజయవంతం చేయాలి

గోదావరిఖని: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు తెలిపారు. మంగళవారం గోదావరిఖనిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యకు తక్కువ బడ్జెట్ కేటాయించి, విద్యారంగాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పిల్లలకు పుస్తకాలు, రెండు జతల దుస్తులు అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతమ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రసన్న, నాయకులు పవన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సజావుగా ఔట్ పేషెంట్లకు సేవలు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో ఔట్ పేషెంట్లకు సజావుగా సేవలందిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్ తెలిపారు. 'సాక్షి'లో మంగళవారం ప్రచురించిన 'జీజీహెచ్‌లో కిటకిట' అనే కథనానికి స్పందించి, వివరణ ఇచ్చారు. ఔట్ పేషెంట్లకు బయోమెట్రిక్ విధానంతో రిజిస్ట్రేషన్ చేస్తున్న సమయంలో రాష్ట్రస్థాయిలో సాంకేతిక సమస్య వచ్చిందన్నారు. అరగంటపాటు విద్యుత్ సరఫరా లేని కారణంగా సర్వర్ బిజీ ఉందని, దీంతో ఔట్ పేషెంట్లు అధిక సంఖ్యలో వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తిందని పేర్కొన్నారు. వెంటనే సమస్య పరిష్కరించామన్నారు.

గైర్హాజర్ ఉద్యోగులను చైతన్యపర్చాలి

- కార్పొరేట్ పర్సనల్ జీఎం హన్మంతరావు


వీసీలో పర్సనల్ అధికారులు

గోదావరిఖని: గైర్హాజర్ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వారిని చైతన్యపర్చాలని కార్పొరేట్ పర్సనల్ జీఎం హన్మంతరావు అన్నారు. మంగళవారం ఆర్జీ–1, 2 పర్సనల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్‌సీడబ్ల్యూఏ 11వ వేతన ఒప్పందం అమలు, కోర్టు కేసులు, క్రమశిక్షణా చర్యలు, దేశీయ విచారణల స్థితి, గైర్హాజర్ కౌన్సెలింగ్ వివరాలు, నెలవారీ నివేదికలు, కేడర్ పథకాలు, పదోన్నతులు, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ, పదోన్నతులు తదితర విషయాలు, సంబంధిత సమస్యలపై చర్చించి, పరిష్కార మార్గాలను సూచించారు. సమావేశంలో డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్.అనిల్‌కుమార్, డీవైపీఎం వేణుగోపాల్, వంశీధర్, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్, సంక్షేమాధికారి ఓంకారి బాబు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే చెప్పాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మహిళాసాధికారిత డిస్ట్రిక్ట్ హబ్‌లో ఒప్పంద ప్రాతిపదికన అర్హులైన ఉద్యోగ నియామకాల ప్రొవిజనల్ జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 15లోగా తెలపాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్ కోరారు. స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా మెరిట్ జాబితా కలెక్టరేట్‌లోని కార్యాలయం నోటీస్‌బోర్డులో అందుబాటులో ఉందన్నారు.

ఎనిమిది చోరీలు.. దొంగ అరెస్టు

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలు
- రూ.12.11 లక్షలు, ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ రెమా రాజేశ్వరి


నగదు, ఆభరణాలు చూపుతున్న సీపీ రెమా రాజేశ్వరి, పక్కన డీసీపీ వైభవ్ గైక్వాడ్, పోలీసు అధికారులు

పెద్దపల్లిరూరల్: తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలు చేస్తున్న ఓ దొంగను సుల్తానాబాద్ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.12.11 లక్షలు, 102.08 గ్రాముల బంగారు, 645 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి మంగళవారం పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్‌తో కలిసి ఆయన ఆఫీస్‌లో సంబంధిత వివరాలను వెల్లడించారు. కాల్వశ్రీరాంపూర్ ఒడ్డెరకాలనీకి చెందిన జెట్‌పట్ పవన్ గతేడాది ఓ బాలికను ప్రేమ పేరుతో మోసగించి, కిడ్నాప్ చేశాడు. దీనిపై చెన్నూరు, బెల్లంపల్లి 2వ టౌన్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. తర్వాత అరెస్టయి, జైలుకు వెళ్లాడు. అక్కడ పరిచయమైన వారి వద్ద సులువుగా దొంగతనాలు ఎలా చేయవచ్చో తెలుసుకొని, చోరీలు చేస్తున్నాడు.

రాత్రిళ్లు దొంగతనాలు

పవన్ మధ్యాహ్నం సమయంలో తాళం వేసిన ఇళ్లను పరిశీలించి, రాత్రుళ్లు దొంగతనాలు చేస్తున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే అతను సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆశతో చోరీలకు పాల్పడుతున్నాడు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధి పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, కాల్వశ్రీరాంపూర్ పరిధిలో ఐదు, సుల్తానాబాద్ ఠాణా పరిధిలో రెండు దొంగతనాలు చేశాడు. ఈ నెల 5న రాత్రి సుల్తానాబాద్ మండలంలోని అల్లీపూర్‌లో రావుల మల్లయ్య ఇంట్లో చోరీ చేశాడు. మంగళవారం ఉదయం కాల్వశ్రీరాంపూర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు అదుపులోకి విచారించగా దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. పవన్ వద్ద నుంచి నగదు, ఆభరణాలతోపాటు సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకొని, అతన్ని కోర్టులో హాజరుపర్చినట్లు సీపీ తెలిపారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సుల్తానాబాద్ సీఐ జగదీశ్, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై శ్రీనివాస్, సుల్తానాబాద్ ఎస్సైలు విజయేందర్, అశోక్‌రెడ్డితోపాటు కానిస్టేబుళ్లు తిరుపతి, రఘు, రమేశ్, రాజేశ్, రమేశ్‌లకు రివార్డు అందించి, అభినందించారు. ఏసీపీ ఎడ్ల మహేశ్, సీఐలు అనిల్‌కుమార్, సత్యనారాయణ తదితరులున్నారు.

కెమెరాల ఏర్పాటుకు ముందుకురావాలి..

ప్రతి గ్రామంలో, వార్డులో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకురావాలని సీపీ రెమా రాజేశ్వరి కోరారు. ఇప్పటికే పోలీసు అధికారులు చొరవ చూపి, కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. స్థానికులు కూడా సహకారం అందిస్తే నేరాల నియంత్రణ సులువు అవుతుందని పేర్కొన్నారు.

రెస్క్యూ పోటీలు ఘనంగా నిర్వహించండి

- కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య

గోదావరిఖని: జాతీయ స్థాయి రెస్క్యూ పోటీలు మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య సూచించారు. మంగళవారం మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 27 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు మైన్స్ రెస్క్యూస్టేషన్, 7 ఎల్ఈపీ గనిలో ఐదు రోజులపాటు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో కోలిండియా అనుబంధ బొగ్గు కంపెనీలు, సింగరేణి, యురేనియం, హిందూస్థాన్ జింక్, హిందూస్థాన్ కాపర్‌తోపాటు మొత్తం 25 జట్లు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. సంస్థ పేరుప్రతిష్టలతో ముడిపడి ఉన్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్.సాంబయ్య, డీజీఎం సివిల్ ధనుంజయ, మైన్స్ రెస్క్యూ స్టేషన్ సూపరింటెండెంట్ మాధవరావు పాల్గొన్నారు.


సమావేశంలో అధికారులు

ఆరోగ్య భద్రత బాధ్యతగా తీసుకోవాలి

రక్షణతోపాటు ఆరోగ్య భద్రతను బాధ్యతగా తీసుకోవాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య అన్నారు. మంగళవారం ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1 సైటాఫీస్‌లో ఏర్పాటు చేసిన రక్షణ సమావేశంలో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. రక్షణను అందరూ బాధ్యతగా భావించినప్పుడే సింగరేణి సంస్థలో ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. కాలానికనుగుణంగా మనలో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ప్రాజెక్టు అధికారి ఎన్.రాధాకృష్ణ, ఏరియా రక్షణ అధికారి వెంకటరమణ, ప్రాజెక్టు ఇంజినీర్ ఆర్.శ్రీనివాస్, గని మేనేజర్ ఉదయ్‌హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి


ధర్మారంలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

ధర్మారం: మండలంలోని పలు గ్రామాల్లో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వం భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ధర్మారం మండల శాఖ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, రైతులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఆందోళన విరమించాలని ఎస్సై అశ్విని కోరినప్పటికీ తహసీల్దార్ వచ్చి, వినతిపత్రం తీసుకోవాలన్నారు. పోలీసుల సమాచారంతో డిప్యూటీ తహసీల్దార్ మల్లారెడ్డి వచ్చి, వినతిపత్రం తీసుకున్నారు. విచారణ నిమిత్తం ఉన్నతాధికారులకు పంపిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ హాజరై, మాట్లాడారు. రూ.లక్షల విలువ చేసే ధర్మారం మండల కేంద్రంతోపాటు నర్సింగపూర్, ఖిలావనపర్తి, కటికెనపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ భూములను అధికార పార్టీ నాయకులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది అనర్హులు దొంగ పట్టా తీసుకొని, ధరణి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ చేయించుకొని, రైతుబంధు లబ్ధి పొందుతున్నారని అన్నారు. జిల్లాస్థాయి అధికారులు విచారణ చేపట్టి, వారిని తొలగించి, అర్హులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశా రు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు బొల్లి స్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు మోటపలుకుల అశోక్, కాంపెల్లి రాజేశం, అరిగె లింగయ్య, కరేటి వేణు, ఎదుల్ల అంజయ్య, ఈదుల శ్రీనివాస్, తుమ్మర తిరుపతి, మహమ్మద్ అష్రాఫ్, రఫీ, మెండె మహేందర్, ఉత్తెం రాజయ్య తదితరులున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి


మల్లీశ్వరి (ఫైల్)

గోదావరిఖని: గుర్తు తెలియని వాహనం ఢీకొని, ఓ మహిళ మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖని గాంధీనగర్ టీటూ 566 క్వార్టర్‌లో నివాసం ఉంటున్న కడారి మల్లీశ్వరి(55) సోమవారం రాత్రి కిరాణా దుకాణానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై స్వామి తెలిపారు. మృతురాలి భర్త నారాయణస్వామి రిటైర్డ్ కార్మికుడు కాగా రెండేళ్లుగా పక్షవాతంతో బాధ పడుతున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత


రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

- డీవైడీజీఎంఎస్ భూషణ్ హరిప్రసాద్ సింగ్

గోదావరిఖని: ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని సౌత్ సెంట్రల్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీవైడీజీఎంఎస్) భూషణ్ హరిప్రసాద్ సింగ్ అన్నారు. మంగళవారం ఆర్జీ–1 ఏరియా 18వ రక్షణ త్రైపాక్షిక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ముందుగా గని ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం గత రక్షణ త్రైపాక్షిక సమావేశంలో ప్రతిపాదించిన తీర్మానాలు, అమలైన అంశాలపై సమీక్షించారు. రక్షణ చర్యలు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. రక్షణపై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టిన తర్వాతే ఉత్పత్తిపై దృష్టిసారించాలన్నారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, కార్పొరేట్ ఆర్‌అండ్‌డీ జీఎం ఎస్‌డీఎం సుభాని, యూనియన్ నాయకులు గండ్ర దామోదర్‌రావు, ఆర్.శ్రీనివాస్, ఖయ్యూం, సదానందం, ఎం.శ్రీనివాస్, హరిణ్, అన్ని గనుల వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, ఏజెంట్లు, మేనేజర్లు, గ్రూప్ ఇంజినీర్లు, సేఫ్టీ ఆఫీసర్లు, పిట్ ఇంజినీర్లు, ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ స్వంత ఇల్లు ఉండి ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ ఉన్న ప్రతిఒక్కరికి 1 లక్ష నుండి 10 లక్షల వరకు అతి తక్కువ ఋణాలకు సలహాలు ఇవ్వబడును. ఫోన్: 7989671278. [H-796918]

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788601]

WANTED

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221199]

■ VISA Consultation Overseas Blue & White Collar Jobs All Profiles Lucrative Salary Highpay. Interviews Vizag 9th to 11th July&Hyd. 13th&14th July. Ph: 9717618737 [HA-3289]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

కాందిశీకుల కుటుంబాలకు నివేశన స్థలాలివ్వాలి


మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న రామారావు, ఎమ్మెల్యే చందర్

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని బర్మా, శ్రీలంక కాందిశీకుల సమస్యల పరిష్కారంతోపాటు టెక్స్‌టైల్ మిల్లు భూముల విషయమై బర్మా, కాందిశీకుల సంఘం అధ్యక్షుడు జమ్ముల రామారావు ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం అందించారు. కాందిశీకుల కుటుంబాలకు పది గుంటల చొప్పున నివేశన స్థలం, ఇళ్ల పట్టాలు, స్పిన్నింగ్, వీవింగ్ కార్మికులకు రావాల్సిన బకాయిలు ఇవ్వాలని, మాజీ కార్మిక కుటుంబాల వారసులకు ఇండస్ట్రియల్ పార్కులో ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు. రైలు ఢీకొట్టడం వల్ల మరణించి ఉంటాడని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 56509 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

పెంకుటిళ్లు కూలిపోతాయ్.. జాగ్రత్త


చందపల్లి కూడలికి వెళ్లే దారిలో కవర్ కప్పిన పెంకుటిల్లు


పెద్దపల్లి తిలక్‌నగర్‌లో..


పాతబజార్‌లో..


కంచర బావి వద్ద..

వర్షం కురిస్తే పెంకుల నుంచి జాలువారిన నీటితో గోడలన్నీ తడిపోయి, ఉరుస్తూ రాత్రంతా నిద్రలేమితో నరకయాతన కొందరికి.. గూనపై కవర్లు కప్పి, ఈసారి గడిస్తే చాలు అంటూ మరికొందరు వానాకాలం వస్తే భయం గుప్పిట్లో రోజులు వెళ్లదీస్తున్నారు. ఇలా చాలా కుటుంబాలు తాతల కాలంనాటి పెంకుటిళ్లలో వర్షాకాలం ఇబ్బందులు పడుతూ ఉంటున్నాయి. వానకు తడిసి తడిసి, ఆ ఇళ్లు కూలిపోయి, ప్రాణాలమీదకు వస్తుందని అంటున్నారు చూసేవారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారులు కూలే స్థితిలో ఉన్న ఇళ్లను గుర్తించి, బాధితులను ప్రత్యామ్నాయ నివాసాలకు తరలించాలని సూచిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్, సాగర్ రోడ్, పాతబజార్‌లలో ప్రమాదకరంగా మారి, కూలే దశలో ఉన్న ఇళ్లను'సాక్షి' తన కెమెరాలో బంధించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి